కథ

# ముహూర్తబలం

అప్పటికి అరగంట నుంచీ నిలబడిన నేను అసహనంగా పరిసరాలు పరికిస్తున్నాను. ఆయన నన్ను చూసినా కూర్చోమని అనలేదు. ఆయన కోపం నాకు తెలుసు. అయినా అవసరం నాది.

ఆయన పని పూర్తయినట్టుంది. తాపీగా పడక కుర్చీలో వెనక్కు వాలుతూ అన్నారు వ్యంగ్యంగా.

''ఏంట్రోయ్! దారి తప్పి వచ్చావు. నాతో ఏదైనా పని పడిందా?''

''అవును మామయ్యగారు! మా అమ్మాయి...'' నా నోటినుంచి మాట ఇంకా పూర్తికాకుండానే ఆయనే అన్నారు.

''నాన్నా అమ్మా బాగున్నారా? తమ్ముడి దగ్గరకు వెళ్ళారట కదా! ఉత్తరాలు వ్రాస్తున్నారా?''

''అవునండీ. మిమ్మల్ని అడిగినట్లు చెప్పమని కూడా ఉత్తరంలో వ్రాసారు'' అబద్ధమాడాను.

''ఆహా! అలాగా. నన్ను అడిగినట్లు చెప్పమని నీకు ఉత్తరంలో వ్రాస్తే మరి నాకు ఉత్తరం వ్రాయడం ఎందుకు డబ్బు దండగ.''

షాకయ్యాను. దొరికిపోయాను.

''అబద్ధాలు నాదగ్గర ఎందుకురా ప్రసాద్. ఈవేళ నువ్వు ఈ సమయానికి ఫలానా పనిమీద వస్తున్నావని, తన మొహం చూసి నీకు సాయం చేయమని మీ నాన్నగారు నాకు ఉత్తరం వ్రాసారు. నీకు మాలాంటివారి ఇళ్ళకు రావడం పడదు. ఏదైనా సాయం చేయడానికి టైం వుండదు. కానీ మీరొచ్చిన వెంటనే నేను మీ పని చేసి పెట్టాలి. ఆహా... అవకాశం వచ్చింది కదాని దెప్పుతున్నాను అనుకోకు బాబూ. ఇప్పుడు చెప్పు ఏమిటి నీ పని?''

అనవలసిన మాటలన్నీ అనేసిన ఆయన ముఖం చూస్తే అప్పుడు బాణం తగిలి విలవిలలాడుతున్న పావురాన్ని పాశవిక ఆనందంతో పరిశీలిస్తున్న భావం గోచరించింది నాకు. అయినా తప్పదు. అవసరం నాది.

''మా అమ్మాయి డిగ్రీ సెకండియర్ చదువుతోంది. ఇప్పటినుంచి చూస్తేనేగానీ సంబంధం కుదరదు. అందుచేత దాని జాతకం మీచేత వ్రాయిద్దామని!''

''మీ నాన్నగారు పంపగా వచ్చావు. అంతేనా!'' ఆయన లేచి చుట్ట వెలిగించి పచార్లు చేస్తూ దీర్ఘాలోచనలో పడ్డారు.

''అదికాదు మామయ్యగారూ. మీరుచేసే పూజలకి నిత్యం హాజరై అందరికీ వడ్డించడంలో సాయం చేయాలని నాకు ఎంతగానో వుంటుంది. అయితే వృత్తి ధర్మం...''

''చాల్లేరా. నాకేం తెలియనట్లు చెబుతావేం? నువ్వు సంపాదించే సంపాదనలో పాతిక రూపాయలతో ఓ దండ కొనుక్కొచ్చి అమ్మవారికి వేసేంత తీరిక లేకపోయిందట్రా? మీనాన్నగారికి నేనంటే ఎంత అభిమానం. 'ఏమీ లేకుండా ఈ ఊరు వచ్చిన మమ్మల్ని సొంత ఇల్లు కలవారిలా చేసి మేమింత అభివృద్ధిలోకి రావడానికి కారణం మీరు' అంటూ అనుక్షణం నన్ను ఆయన తలుస్తుంటారే! ఆ కృతజ్ఞతలో ఆవగింజంత అయినా ఉందిరా నీకు? హు... అయితే నీకు నిక్కచ్చిగా చెబుతున్నాను. నేను వ్రాసే జాతకం మీద నీకు నమ్మకం పూర్తిగా ఉంటేనే వ్రాసి ఇస్తాను. ఒకవేళ తరువాత ఏదన్నా జరగకూడనిది జరిగిందనుకో. అయ్యో! అనవసరంగా నాకిష్టంలేనివాళ్ళ దగ్గరికి వెళ్ళి జాతకం వ్రాయించానే అని నువ్వు బాధపడితే మాత్రం బాగుండదు. సరేనా!'' అన్నారాయన.

''అయ్యో ఎంతమాట? పెద్దమనసు చేసుకుని మీరు ఒప్పుకోవడమే మా అదృష్టం మామయ్యగారు.

**వేద వేదాంగాలు ఔపోసనపట్టి నిత్యం మూడుపూటలా గాయత్రి మంత్రం జపించే ఆయన అమ్మవారిని నిలబెట్టిన మొదటిరోజు మొదటి దండ అన్నయ్యచేతే వేయిస్తారు. ఊరిలో ఎంతోమంది మోతుబరులు, డబ్బున్నవారు ఉన్నా వేలకువేలు అమ్మవారికి కానుకలుగా సమర్పించినా అన్నయ్యపట్ల ఆయనకున్న అభిమానం, నమ్మకం, వాడికి అంత విలువను ఆపాదించిపెట్టాయి.**

నావల్ల తప్పులుంటే మనస్ఫూర్తిగా క్షమించండి. మా ఇంట్లో సమస్త శుభకార్యాలు మీరు పెట్టిన ముహూర్తబలంతోనే జరిగాయి. అందరమూ సుఖంగా ఉన్నాం. మా చేత వేయించే గవ్వలలో ఒక్క గవ్వ తిరగబడితే చాలు మాకు అపశృతి జరగడానికి. అనుక్షణం మా మంచి కోరే మనసు మీదని నాకు తెలుసు. మీరన్నట్లు నాన్నగారు దైవాన్ని స్మరించడం మర్చిపోతారేమోగానీ మిమ్మల్ని రోజుకోసారి స్మరించడం మాత్రం మానరు. అందుచేత ఈ కార్యం మీవల్లనే అవుతుందన్న నమ్మకంతో ఇక్కడకు వచ్చాను. దయచేసి ఈ పని మనస్ఫూర్తిగా చేసిపెట్టండి. మీ ఆశీర్వాదం వల్ల నా బిడ్డ సుఖంగా ఉంటే అంతకన్నా మాకు ఏం కావాలి?''

''ఆమాత్రం విశ్వాసం నామీద వుంటే అదే చాలు. ఇకనైనా అప్పుడప్పుడు వచ్చి కనిపిస్తుండు.''

నా మనసు కుదుటపడింది. అమ్మయ్య... అనుకుని జేబులోంచి వందనోటు తీసి ఆయన ముందు వుంచబోతూ అన్నాను.

''ఇది వుంచండి మామయ్యగారూ!''

అంతే! ఆయన కయ్యిమని లేచారు.

''మూర్ఖుడా! నేను...మీ నాన్నగారు చెప్పాక కూడా డబ్బు తీసుకునే రకమనుకున్నావా? ముందది తీసి చేత్తో పట్టుకో'' హుంకరించారాయన.

'జేబులో పెట్టు' అనలేదాయన. 'చేత్తో పట్టుకో' అన్నారు అంటే నాకు అర్థమయింది. మరో వంద కూడా తీసి పట్టుకుని బల్లమీద పెట్టిన వంద కూడా తీసి ''అమ్మవారి పూజ నిమిత్తం ఉపయోగించండి మామయ్యగారు'' అన్నాను.


''అయితే కాళ్ళు చేతులు కడుక్కుని వెళ్ళి లోపల అమ్మవారి ముందు హుండీలో వేసిరా.''

నేను నూతి దగ్గరకు వెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కుని అమ్మవారి గదిలోకి వెళ్ళాను. నిజమైన దేవాలయాన్ని తలపిస్తోంది ఆ గది.

రాజరాజేశ్వరిదేవి రూపంలో దుర్గామాత వెండి మండపంలో మకర తోరణాల మధ్య వెండి ప్రమిదల దీపాల కాంతులతో తన సహజ తేజస్సును ప్రసరిస్తూ ప్రకాశిస్తోంది.

ఆ గది పైకప్పుకు తగిలేలా రోజ్‌వుడ్‌తో తయారుచేసిన దేవతా మండపంలో ప్రతి వస్తువూ తన పవిత్రతను చాటుతున్నాయి. నిత్య కుంకుమార్చన, అభిషేకం అన్నీ పూర్తయిన చిహ్నాలు కనిపిస్తున్నాయి గదిలో. గదంతా సుగంధ పరిమళాలు, సాంబ్రాణి ధూప సువాసనలతో మిళితమై తథాత్మ్యంలో ఎటువంటివాడినైనాసరే ఆ గదిలోకి అడుగుపెడితే చేయెత్తి నమస్కరించేంత తన్మయత్వం కలిగేలా వుంది.

నేను అమ్మవారి ముందు కుంకుమ తీసి బొట్టు పెట్టుకుని రెండువందలు ప్రక్కనే వున్న హుండీలోవేసి



మనస్ఫూర్తిగా నమస్కరించుక న్నాను 'నా బిడ్డకు మంచి సంబంధం కుదిరేలా చేం మని.'

నేను నమస్కరించుకున్న ఆ ణం ముహూర్తబలం విలువ నా కోరిక నిజమైననాడుగా నాకేం తెలియలేదు.

ఆయన వ్రాసి నాకు అంద సిన మా అమ్మాయి జాతకం వల్ల ఆమెకు తగిన వరు దొరికాడు.

★★★

దీక్షితులు మామయ్యగారితో మా కుటుంబ పరిచయం ఈనాటిదికాదు. ఇరవై ఐదు సంవత్సరాల క్రితంది. ఆ రోజుల్లో అన్నయ్య టైఫాయిడ్ వచ్చి నలభై లంఖణాలు చేశాక సంధి ప్రేలాపనలోకి దిగితే దీక్షితులు మామయ్యగారు చే న పూజ ఫలితమే అన్నయ్య తిరిగి మాకు దక్కడం. అందులో అన్నయ్య వెన్నపూస వంటి మనసు కల వాడని, వాడినుంచి ఎలాంటి సహాయమైనా అడిగిన ంటనే పొందవచ్చని అనుకున్నారేమో దీక్షితులుగారు. డికి దగ్గరలో ఉపన యన ముహూర్తం పెట్టేసి అత్యం ఘనంగా ఆయన చేయించిన తీరుకి నాన్నగారి దృ లో ఇహలోకపు దేవుడిగా మిగిలిపోయారు. ఆ కృతజ్ఞత అన్నయ్యకు కూడా పుష్కలంగా వుంది.

మా ఊరిలో దేవీ నవరాత్రులు ఆయన నిర్వహించినంత ఘనంగా ఏ సంఘమూ నిర్వహించలేదు. ఆ తొమ్మిదిరోజులూ పూజలు, నిత్య పారాయణాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, భజనలతో వారి ఇల్లు మరో విజయవాడలా వెలిగిపోతుంది.

వేద వేదాంగాలు ఔపోసనపట్టి నిత్యము మూడుపూటలా గాయత్రీ మంత్రం జపించే ఆయన అమ్మవారిని నిలబెట్టిన మొదటిరోజు మొదటి దండ అన్నయ్యచేతే వేయిస్తారు. ఊరిలో ఎంతోమంది మోతుబరులు, డబ్బున్నవారు ఉన్నా వేలకువేలు అమ్మవారికి కానుకలుగా సమర్పించినా అన్నయ్యపట్ల ఆయనకున్న అభిమానం, నమ్మకం, వాడికి అంత విలువను ఆపాదించిపెట్టాయి.

ఆ తొమ్మిదిరోజులూ అన్నయ్య సెలవుపెట్టి తన


**కొత్తపల్లి ఉదయబాబు**


ఫామిలీతో వచ్చి వారి ఇంట్లోనే వుండి (సొంత ఇల్లు ఉన్నా) కుటుంబమంతా స్వంత కొడుకు మాదిరిగా సేవ చేసి వెళ్తారు. అంటే ఆయనకు కొడుకు లేక కాదు. ఉండీ లేనివాడు.

ఆయన కొడుకు వివాహమైన తరువాత అతని భార్య తనతో తీసుకుపోయింది. భార్యపట్ల విధేయత కలిగిన అతడు తల్లిదండ్రులను పూర్తిగా విస్మరించడమే అన్నయ్యను అంత దగ్గరకు చేరదీయడానికి కారణం.

అటువంటి నిత్యాగ్ని హోత్రావధానికి నేనంటే కోపం రావడానికి కూడా కారణం ఉంది.

అవి నేను ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న రోజులు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌కి దీక్షితులు మామయ్యగారే గురువుగారు. ఆయన గెలుపొందినది మామయ్యగారు పెట్టిన ముహూర్తానికి నామినేషన్ వేయడంవల్లనే అని ఆయన దృఢ విశ్వాసం. ఆయనకు మామయ్యగారి మాటంటే వేదవాక్కు.

అంతక్రితం ఏదో ఒక సందర్భంలో నాన్నగారు "మావాడికి మీరు మాట సాయం చేయాలి" అన్నారు.

“దానికి ఆయన వాడిని అప్లికేషన్ పెట్టేటప్పుడు నాతో చెప్పమనండి” అన్నారు హేళనగా నన్ను ఎగాదిగా చూసి.

డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ప్రకటన పేపర్‌లో చూశాక నేను అప్లికేషన్ పెట్టాను. వ్రాతపరీక్ష పూర్తయి ఇంటర్వ్యూకి హాజరు కావలసిందిగా కాల్ లెటర్ వచ్చింది. ఆనందోత్సాహాలతో నాన్నగారు, నేను ఆ లెటర్‌తో ఆయనవద్దకు వెళ్లాం. సాయంసంధ్యకు గాయత్రీ జపానికి సిద్ధమవుతున్న ఆయనకి నాన్నగారు విషయం చెప్పారు.

ఆయనకు తీవ్రమైన కోపం వచ్చింది. అంత కోపం ఎందుకు వచ్చిందో నాకు అర్థం కాలేదు.

“శాస్త్రిగారూ! మీరు ప్రతిదానికీ వీడిని వెంటపెట్టుకుని వస్తారేంటి? ఇప్పుడు నేను వాడితో మాట్లాడతాను. మీరు మౌనంగా వినండి. మధ్యలో మాట్లాడవద్దు” శాసిస్తున్నట్లు అన్నారాయన.

నాన్నగారు ఏదో చెప్పబోయి ఆగిపోయారు.

నేను ముందుకు వెళ్లి కాల్ లెటర్ అందించాను.

దాన్ని నా ముఖాన విసిరికొట్టారాయన. నాకు రక్తం ఉడికిపోయింది. అతి బలవంతంగా వేళ్ళు లెక్కపెట్టుకున్నాను.

“ఏరా! ఇదివరకు నువ్వు వచ్చినప్పుడు ఏం చెప్పాను. అప్లికేషన్ పెట్టేటప్పుడు నాతో చెప్పమన్నానా?”

“చెప్పమన్నారు.”

“మరి నాతో చెప్పావా?”

“లేదండీ!”

“మరి ఈవేళ కాల్ లెటర్ తీసుకుని నా దగ్గరకు వచ్చావంటే ఏమిటి అర్థం? నేను వ్రాత పరీక్ష పాసయ్యాను. అదంతా నా ప్రతిభే. మీరు కేవలం ఒక్కమాట వేసేస్తే చాలు జాబ్ వచ్చేస్తుంది అనే నిశ్చయమే కదా!”

“అది కాదు సార్.”

“నువ్వు నాకు ఇంకేమీ చెప్పొద్దు. నీ స్వంత ప్రతిభతో పరీక్ష పాసయినట్టే మగాడివైతే జాబ్‌కూడా ఏటువంటి రికమెండేషన్ లేకుండా సంపాదించు. నాకు టైమైంది సంధ్య వార్చుకోవడానికి. ఇంక మీరు వెళ్ళవచ్చు.”

చెప్పు పుచ్చుకుని కొట్టినట్టు చెప్పిన ఆయన సమాధానికి మనసు మండిపోతుండగా బయటకు వచ్చేసాను నాన్నగారితో.

నాకు ఆత్మాభిమానం చాలా ఎక్కువ ఆ రాత్రంతా నేను వెక్కి వెక్కి ఏడ్చాను. నా తప్పులేకుండా ఆయన చేసిన ఆ అవమానం నా జన్మలో మరచిపోలేను. అందుకే ఆయనకి దూరంగా వుండేవాడ్ని.

నా స్వయంశక్తితోనే ఉద్యోగం సంపాదించుకున్నాను. మెరిట్‌లో నెంబర్‌వన్‌గా సెలక్టయ్యాను. అయితే ఆయన దగ్గరకు వెళ్లి ఉద్యోగం వచ్చింది అని చెప్పలేదు నేను. నాన్నగారే చెప్పుకున్నారు.

ఆటు తరువాత ఆయన ఎప్పుడైనా ఎదురుపడితే తప్పనిసరై ఒక నమస్కార బాణం వదిలేవాడిని. ఆయన నిర్లక్ష్యంగా తలెగరేసి వెళ్లిపోయేవాడు.

ఆటు తరువాత మళ్ళీ ఈనాడు నా అవసరం కోసం ఆయన ఇంటికి వెళ్ళడమే!

★★★

“శ్రీ ప్రసాద్‌గారికి,

నమస్కారములు. మీ కుటుంబ గౌరవం, సాంప్రదాయాలు అన్నీ నచ్చాయి. అయితే మా అబ్బాయి జాతకంతో మీ అమ్మాయి జాతకం ఏమాత్రం సరిపోలేదు. కారణం మీ అమ్మాయికి జాతకంలో కుజదోషం ఉందట. ఆ విషయం మీకు తెలిసే చెప్పలేదో, నిజంగా మీకు తెలియదో మాకు తెలియదుగానీ మీ సంబంధం వదులుకుంటున్నామని తెలియజేయడానికి విచారిస్తున్నాము.

నమస్తే”

మగపెళ్ళివారినుండి వచ్చిన ఉత్తరం చూసి నేను, పద్మ షాకయ్యాము.

‘మా అమ్మాయికి కుజదోషం వుంది’ అన్న విషయాన్ని నేను, నా భార్య అయితే అంత తేలిగ్గా తీసుకోలేకపోయాం. మా తమ్ముడిగారింట్లో హైదరాబాద్‌లో ఉండి చదువుకుంటున్న తనని హడావుడిగా టెలిగ్రాం ఇప్పించి రప్పించాను పెళ్లిచూపుల కోసం. నా కూతురని చెప్పడం కాదుగానీ అశ్వని అన్నింటిలోనూ చలాకీగా వుండే ఫస్ట్‌గ్రేడ్ అమ్మాయి. అతి సున్నితమైన మనస్తత్వం. తనకీ విషయం తెలిస్తే చాలా బాధపడుతుంది.

నా భార్య వారిస్తున్నా వినకుండా ఎందుకైనా మంచిదని కంప్యూటర్ జాతకం వ్రాయించాను. మరో పండితుడిచేత రాయించాను. నా అనుమానం నిజమైంది. అశ్వనికి కుజదోషం లేదు. సరిగ్గా ఆరోజే నాకు నేనూహించని ఉత్తరం శుభలేఖతో సమానమైన వార్తను మోసుకొచ్చింది.

★★★

“శ్రీ ప్రసాద్‌గారికి,

శ్రీనివాసరావు నమస్కారాలు. నేను దీక్షితులుగారి అబ్బాయిని. మనం కలుసుకుని చాలా కాలమైంది. నా వివాహం కాకముందు అప్పుడప్పుడు మీ ఇంటికి వస్తుండేవాడిని. మా అబ్బాయి కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. ఆధునిక భావాలున్నవాడు. ప్రేమించింది మీ అమ్మాయిని అని తెలుసుకున్న నాకు ఆశ్చర్యంతోపాటు ఆనందం కలిగాయి. మా నాన్నగారికి తన వారసుడుగా నేను ఆయన విద్య అభ్యసించలేదని కోపం. ఆ విధంగా ఆయన నన్ను దూరం చేసుకుంటూనే వున్నా నా బాధ్యతగా ప్రతి ఉత్తరంలోనూ వారిని నావద్దకు వచ్చేయమని కోరుతూనే వున్నాను. కానీ ఆయన పద్ధతిలో మాత్రం ఏమాత్రం మార్పులేదు. నా ఉత్తరానికి ఏనాడూ ఆయన సమాధానం వ్రాయరు.

అందుచేత ఈసారి వియ్యంకులు కాబోతున్న మీద్వారా ఈ విషయాన్ని ఆయనకి తెలియజేస్తారని ఆశిస్తూ ఆయనకు కూడా నేను విడిగా వ్రాసి ఈ కవరులోనే వుంచిన రెండవ లెటర్ ఆయనకు అందజేయవలసిందిగా కోరుతున్నాను. ఈ లెటర్‌నే టెలిగ్రామ్‌లా భావించి మీ దంపతులు బయలుదేరి వస్తే అన్ని విషయాలూ మాట్లాడుకుందాం. మీ అమ్మాయిని మేం చూసాం. మాకు అన్నివిధాలా నచ్చింది. మా అబ్బాయి అభిప్రాయం కాదనే ధైర్యం మాకులేదు. పూర్తిగా వాడి ఇష్టమే మా ఇష్టం. మీ రాకకోసం ఎదురుచూస్తూ-”

శ్రీనివాసరావు.

మా ఆనందానికి అవధుల్లేవు.

రెండవ ఉత్తరం విప్పాను. అందులో ఇలా వుంది.

“పూజ్యులైన నాన్నగారికి,

నమస్కరించి మీ కొడుకు, కోడలు వ్రాయునది. ఇక్కడ మేం క్షేమం. మీరు ఆరోగ్యంగా ఉన్నారని తలుస్తాను. మీ మనవడి వివాహం నిశ్చయం చేశాము. అతి తక్కువ సమయం ఉండడం వలన మీదగ్గరకు వచ్చి సలహా తీసుకునే సమయం లేకపోయింది. అమ్మాయి ఎవరోకాదు, మీకు అత్యంత ఆప్తులైన శాస్త్రిగారి మనవరాలు. వారి రెండవ అబ్బాయి మన ఊరిలోనే టీచర్‌గా పనిచేస్తున్నారు. నా తరఫున మీరెలాగూ రారని మీ పట్టుదల తెలిసిన నేను ఆడపెళ్ళివారి తరఫునైనా వివాహానికి వచ్చి మీ మనవడిని, అతని భార్యని ఆశీర్వదిస్తారని కోరుతున్నాను. హృదయపూర్వక నమస్కృతులతో

మీ కొడుకు, కోడలు”

ఉత్తరం పూర్తిచేసిన నా పెదవుల పైన అందరినీ కుట్టి బాధించే తేనెటీగను సూదులతో గుచ్చి ఆనందం పొందితే కదలడే మందహాసం వెల్లివిరిసింది. ఆయన కావాలని కుజదోషం ఆపాదిస్తూ వ్రాసి ఇచ్చిన జాతకం ఆయనకే తిప్పి కొట్టిందన్న కసితో ఆ ఉత్తరం చదివాక దీక్షితులుగారి రూపాన్ని ఊహించుకుంటూ దానిని తీసుకుని వారి ఇంటివైపు నడిచాను.

☆

